సాక్షి
ప్రకాశం
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



కూలిన బతుకులు

కూలీల ఆటో బోల్తా పడి ఇద్దరు మృతిచెందగా పది మందికి గాయాలైన ఘటన మార్కాపురం మండలం నికరంపల్లి– కుంట మధ్య ఆదివారం జరిగింది.

- 8లో..



ఉత్సాహంగా ప్రకాశం బాలోత్సవం

ఒంగోలు నగరంలో ప్రకాశం బాలోత్సవాలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసులు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసులు

మద్దిపాడు: జిల్లాలోని ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. దొడ్డవరంపాడు గ్రామంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని, లేకపోతే రైతుకు ప్రభుత్వం అమలు చేసే పథకాలు (పీఎం కిసాన్, 0 వడ్డీ, అన్నదాత సుఖీభవ, పంటల బీమా) వర్తించవన్నారు. విశిష్ట సంఖ్య నమోదుకు రైతు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు తీసుకొని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకొని వెళ్లాలని ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారి కే రమేష్, వీఏఏ ప్రసన్న పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లా కాపు సంఘం సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా కాపు సంఘం సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని కాపు సంఘం అధ్యక్షుడు కే సంజీవకుమార్ కోరారు. ఒంగోలులోని జిల్లా కాపు సంఘ కార్యాలయంలో ఆదివారం సభ్యత్వ నమోదు, జిల్లా నూతన కమిటీ ఏర్పాటు పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీ శ్రీనివాసమూర్తి, ఎన్ సాంబయ్య, సీహెచ్ నారాయణ, సీహెచ్ హనుమంతురావు, వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కేడీలు

జిల్లాలో హైవేలపై యథేచ్ఛగా దొంగతనాలు జరుగుతున్నాయి. వందల కిలోమీటర్లు ప్రయాణించిన లారీ డ్రైవర్లు రాత్రి పూట కాసేపు నిద్రపోయేందుకు రోడ్డు పక్కన లారీలు నిలిపితే చాలు తెల్లారేసరికల్లా డీజిల్, బ్యాటరీ, జాకీలు మాయం అవుతున్నాయి. దాంతో రాత్రి పూట లారీలు ఆపి విశ్రాంతి తీసుకోవాలంటే లారీ డ్రైవర్లు భయపడిపోతున్నారు. ప్రతి రోజూ జిల్లాలో పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని లారీ యజమానులు వాపోతున్నారు.

- హైవే పక్కన నిలిపి ఉంచిన లారీల్లోంచి డీజిల్ చోరీ
- రోజుకు లక్ష రూపాయలపైగా డీజిల్ మాయం
- నెలకు రూ.1.5 కోట్ల విలువైన బ్యాటరీలు కొట్టేస్తున్న దొంగలు
- జిల్లా వ్యాప్తంగా రోజుకు 50కి పైగా చోరీలు
- సింగరాయకొండ నుంచి మద్దిపాడు వరకు రోజుకు 10 నుంచి 15 దొంగతనాలు
- ఆటోల్లో సరంజమాతో తిరుగుతున్న దొంగల ముఠా
- హైవే పోలీసులకు తెలిసినా పట్టించుకోని వైనం



ఒంగోలు టౌన్:

హైవే దొంగలు రెచ్చిపోతున్నారు. రోడ్డుపక్కన నిలిపి ఉంచిన లారీలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు చుట్టు పక్కల రాకపోకలకు చెన్నై– కలకత్తా హైవే, గుంటూరు–బెంగళూరు హైవే, రాష్ట్ర హైవేలు ఉన్నాయి. ఒంగోలుకు 20 కిలోమీటర్ల దూరంలో గుళ్లాపల్లి పారిశ్రామికవాడ గ్రోత్ సెంటర్ ఉంది. ఇక్కడి నుంచి దేశంలోని ప్రముఖ పట్టణాలకు వివిధ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకు ప్రతిరోజూ 300 వరకు లారీలు వచ్చిపోతుంటాయి. ఒంగోలు పరిసరాల్లో 20 కోల్డ్ స్టోరేజీలు, వేల సంఖ్యలో వ్యాపార సంస్థలు ఉన్నాయి. దాంతో ఒంగోలుకు సరకు రవాణా, ఎగుమతులు దిగుమతుల కోసం రోజుకు 500 లారీలు వస్తుంటాయని అంచనా. జిల్లాలో సుమారు 10 వేలకు పైగా లారీలు ఉండగా ఒక్క ఒంగోలు నగరంలోనే 1500 లారీలు ఉన్నాయి. దీంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన లారీలను రాత్రి పూట విశ్రాంతి కోసం హైవే పక్కన నిలిపి ఉంచుతుంటారు. అలా నిలిపి ఉంచిన లారీల నుంచి దొంగల ముఠా డీజిల్, బ్యాటరీలు, జాకీలను దొంగలిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో రోజుకు 50 వరకు దొంగతనాలు జరుగుతుండగా సింగరాయకొండ నుంచి మద్దిపాడు లోపు కనీసం 10 నుంచి 15 దొంగతనాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రోజుకు లక్షల విలువైన డీజిల్ మాయం

హైవేలతో పాటుగా లారీ అసోసియేషన్ కార్యాలయాల్లో, ఆటో నగర్‌లో ఎక్కువగా ఈ దొంగతనాలు జరుగుతున్నట్లు లారీ యజమానులు చెబుతున్నారు. ఆపి ఉన్న లారీల నుంచి రోజుకు 1500 లీటర్ల నుంచి 2 వేల లీటర్ల వరకు డీజిల్ చోరీకి గురవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం డీజిల్ ధర లీటరు రూ.100 వరకు ఉంది. డీజిల్ తో పాటుగా బ్యాటరీలు, బ్యాటరీలకు సంబంధించిన రాగి తీగలు, జాకీలు, వీల్ రెంచీ లు, జాకీ రాడ్లను దొంగలించుకొని పోతున్నారని చెబుతున్నారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు రూ.10 వేల వరకు ఉంటుందని, నెల మొత్తంలో రూ.1.50 కోట్ల ఖరీదు చేసే బ్యాటరీలను దొంగిలిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇక జాకీలు, ఇతరత్రా కలిపితే లారీకి రూ.10 వేల చొప్పున నష్టం జరుగుతోందని వాపోతున్నారు.

ఎస్పీ ఆఫీసు సమీపంలోనే చోరీ:

ఎక్కడో హైవేల పక్కన, ఆటో నగర్లో, అసోసియేషన్ కార్యాలయాల్లో ఆపిన లారీల నుంచి డీజిల్ చోరీ జరుగుతుందంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఏకంగా ఒంగోలు నగరం నడి బొడ్డున ఎస్పీ కార్యాలయం, తాలూకా పోలీసు స్టేషన్ల సమీపంలో నిలిపి ఉంచిన రెండు లారీల నుంచి ఆ మధ్య దొంగలు బ్యాటరీలను ఎత్తుకెళ్లారంటే పరిస్థితిని ఊహించుకోవచ్చని లారీ యజమానులు చెబుతున్నారు. నిత్యం పోలీసులు తిరిగే చోటే డీజిల్ దొంగలు తెగబడుతున్నారంటే ఇక ఊరి బయట ఎంత యథేచ్ఛగా చోరీలు చేస్తున్నారో ఊహించుకోవచ్చు.

సాక్ష్యాలు అడుగుతున్న పోలీసులు...

హైవేల వెంట ఆపిన లారీల డీజిల్ దొంగతనాల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. దొంగలు చోరీ చేసినట్లు సాక్ష్యాలు చూపించమని అడుగుతున్నారని వాపోతున్నారు. అంతటితో ఊరుకోకుండా అక్కడే లారీ ఎందుకు ఆపావంటూ సవాలక్ష యక్ష ప్రశ్నలు వేసి వేధిస్తున్నారని, విచారణ పేరుతో కాలయాపన చేస్తుండడంతో తమకు మరింత నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైవేలపై పోలీసులు నిత్యం పెట్రోలింగ్ తిరుగుతుంటారు. వారికి ఈ దొంగల ముఠా గురించి సమాచారం ఉన్నప్పటికీ మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైవే పోలీసులు తలచుకుంటే ఒక్క రోజులోనే ఈ డీజిల్ దొంగల ఆట కట్టించగలుగుతారని కొందరు లారీ యజమానులు చెబుతున్నారు.

ధాబాల పాత్రపై అనుమానాలు..

హైవే దొంగల నుంచి డీజిల్ ను కొందరు ధాబా నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నట్లు లారీ యజమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లారీల నుంచి చోరీ చేసిన బ్యాటరీలు, బ్యాటరీల నుంచి తీసిన రాగి తీగలు, జాకీలు, వీల్ రెంచీలు, జాకీ రాడ్లను ఇనుప సామాన్ల దుకాణాల యజమానులు కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. లూజు డీజిల్ విక్రయించే వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరంజమాతో ఆటోల్లో తిరుగుతూ...

జిల్లాలోని ఒంగోలు పరిసరాల్లో నాలుగు ముఠాలు సంచరిస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ఆటోల్లో గడ్డపార, ఆయిల్ ఒంపుకునేందుకు పైపులతో తిరుగుతున్నట్టు తెలుస్తోంది. నాలుగు ముఠాలు నాలుగు వైపులా బయలుదేరి పక్కా ప్లాన్ తో చోరీలు చేస్తున్నారు. రాత్రి 12 గంటల తరువాత రోడ్డు పక్కన ఆపి డ్రైవర్లు నిద్రపోతున్న లారీలను ఎంపిక చేసుకుంటున్నారు. పెట్రోలు ట్యాంకర్ మీద గడ్డపారతో ఒకే ఒక దెబ్బ కొడతారు. ఆ దెబ్బకు ట్యాంకర్ కు రంధ్రం పడుతుందని, అందులోని డీజిల్ మొత్తం తమ వెంట తెచ్చుకున్న క్యాన్లలో నింపుకొని పరార్ అవుతున్నట్లు సమాచారం.

డీజిల్ చోరీలను అరికట్టకపోతే కష్టమే



డీజిల్ దొంగతనాలు జరుగుతుండటంతో ట్యాంకర్లలో నిండుగా డీజిల్ నింపడం లేదు. విడిగా క్యాన్లలో నింపి ఉంచుకుంటున్నాం. ఒక్కో లారీలోని ట్యాంకర్లో కనీసం 30 లీటర్ల డీజిల్ ఉంటోంది. దొంగలు ఈ మొత్తం డీజిల్‌ను చోరీ చేస్తున్నారు. దాంతో డీజిల్ నష్టపోవడమే కాకుండా డీజిల్ ట్యాంకర్ కూడా పగిలిపోతుంది. దాని మరమ్మతుకు రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. అసలే లారీలకు బాడుగలు లేక యజమానులు అల్లాడిపోతున్నారు. పెరిగిన డీజిల్ ధరలు, రోడ్డు ట్యాక్స్‌లు, టోల్ గేట్లు రుసుంలు భారీగా పెరగడంతో లారీలను నిర్వహించడం కష్టమైపోతుంది. దీనికి తోడు ఇప్పుడు జరుగుతున్న డీజిల్ దొంగతనాలతో మూలుగుతున్న నక్క మీద తాటికాయ పడ్డ చందంగా తయారవుతోంది. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. హైవేల పక్కన లూజుగా డీజిల్ విక్రయిస్తున్న వారిపై దృష్టి సారించాలి. లారీ యజమానులకు న్యాయం చేయాలి.

– దాసరి కాశేంద్ర బాబు, లారీ యజమాని, ఒంగోలు

జీబీఎస్ వైరస్ కలకలం

- అలసందలపల్లి గ్రామానికి చెందిన మహిళ గుంటూరు జీజీహెచ్‌లో జీబీఎస్‌తో చికిత్స పొందుతూ మృతి
- గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ
- జీబీఎస్ అంటువ్యాధి కాదన్న డీఎంహెచ్‌వో



బాధితురాలు కమలమ్మ ఇంటి వద్ద పరిశీలిస్తున్న అధికారులు



చికిత్స పొందుతూ మృతిచెందిన కమలమ్మ

కొమరోలు: జిల్లాలో జీబీఎస్ (గులియన్ బారే సిండ్రోమ్) వైరస్ కలకలం రేపింది. కొమరోలు మండలంలోని అలసందలపల్లె గ్రామంలో జీబీఎస్ వైరస్ సోకి మహిళ మృతిచెందడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామానికి చెందిన 50 సంవత్సరాల మహిళ కమలమ్మ ఈనెల 3వ తేదీ అనారోగ్య సమస్యతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గిద్దలూరులోని ప్రైవేటు వైద్యశాలలో చూపించారు. కానీ కమలమ్మ కాళ్లు, చేతులు చచ్చుబడడంతో వైద్యుల సూచనల మేరకు ఆమెను కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు జీబీఎస్ పాజిటివ్ అని శుక్రవారం నిర్ధారించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం కమలమ్మ మృతిచెందింది.



ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రజియా సుల్తానా

గ్రామంలో వైద్య పరీక్షలు:

అలసందలపల్లె గ్రామంలో కమలమ్మకు జీబీఎస్ సోకడంతో రాజుపాలెం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు చెందిన వైద్యురాలు డాక్టర్ రజియత్‌ఖాను సిబ్బందితో శని, ఆదివారాలు ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేపట్టారు. ఎంపీపీ పాఠశాల వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తే ఇద్దరికి జ్వరం ఉన్నట్లుగా నిర్ధారించినట్లుగా డాక్టర్ రజియత్‌ఖాను తెలిపారు. ఇద్దరు వ్యక్తుల రక్త నమూనాలు సేకరించి గుంటూరు జీజీహెచ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు.

గ్రామంలో పర్యటించిన డీపీవో..

అలసందలపల్లె గ్రామంలో మహిళకు జీబీఎస్ వైరస్ సోకిందని తెలియడంతో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.బాలశంకర్‌రావు, డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్ పి.చక్రధర్ రావు ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. అధికారులు వైద్యురాలు రజియత్‌ఖానుతో గ్రామంలో పరిస్థితిపై చర్చించారు. అనంతరం గ్రామంలో తిరిగి పారిశుధ్య లోపం ఎక్కడైనా ఉందా అని పరిశీలించారు. గ్రామస్తులు తాగుతున్న మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించారు. బాధితురాలు కమలమ్మ ఇంటి వద్ద పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర్‌రావు మాట్లాడుతూ ఈ వైరస్ వలన ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అంటువ్యాధి కాదని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ కాచివడపోసిన నీరు, నాణ్యమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్‌బాబు, డీఈ నవకిశోర్, మార్కాపురం డీఎల్‌పీవో భాగ్యలక్ష్మి, ఎంపీడీవో మస్తాన్‌వలి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీబీఎస్‌తో భయం అవసరం లేదు

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: జీబీఎస్ వ్యాధి అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశాలు లేవని, ఈ వ్యాధి పట్ల ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. జీబీఎస్‌తో బాధ పడుతూ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జిల్లాలోని కొమరోలు మండలం అలసందలపల్లికి చెందిన బైల కమలమ్మ ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఇది ఫుడ్ పాయిజన్‌కు సంబంధించిన కేంపెల్లో బ్యాక్టీరియా వలన జీబీఎస్ సోకుతుందని తెలిపారు. కేవలం వ్యాధి నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారిలో అరుదుగా మాత్రమే మరణం సంభవిస్తుందని చెప్పారు. 99.99 శాతం దానికదే తగ్గిపోతుందని, ఈ వ్యాధి 99.99 శాతం దానికదే తగ్గిపోతుందన్నారు. ఇది వైరస్ కాదని, ఆటోఇమ్యూన్ డిసీజని వివరించారు. మన శరీరంలోని తెల్లరక్తకణాలు మన శరీరం మీదనే దాడి చేయడం వలన ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇమ్యూనోగ్లోబినల్స్‌ను ప్రభుత్వ వైద్యశాలల్లో సిద్ధం చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- 27న కన్నుల పండుగగా రథోత్సవం



దక్షిణకాశీగా పిలిచే పొదిలి శివాలయ ప్రాంగణం

పొదిలిరూరల్: పొదిలి పట్టణంలో వేంచేసి ఉన్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు 14 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు శైవాగమం ప్రకారం నవాహ్నిక దీక్షతో జరుగుతాయన్నారు. ఈ శివాలయంలో ఐదు దేవాలయాలు ఉన్నాయి. పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి దేవాలయం, కామాక్షి సమేత కైలాసనాథ దేవాలయం, త్రిపురసుందరీ సమేత భీమేశ్వరాలయం, శ్యామలాదేవీ సమేత నగరేశ్వర స్వామి దేవాలయం, నిమ్మవ్వ గుడి ఉన్నాయి.

బ్రహ్మోత్సవాలిలా..

ఈ నెల 18వ తేదీ మంగళవారం రాత్రి 8.30 గంటలకు అంకురారోపణ, 19వ తేదీ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 8.30 గంటలకు పార్వతీ పరమేశ్వర అలంకారం, 20న రాత్రి 8 గంటలకు పిగిలిగొట్టు ఉత్సవం, గంగావతరణ, 21న రాత్రి 8 గంటలకు చంద్రవాహనం, నటరాజ అలంకారంలో స్వామి వారు దర్శనమిస్తారు. 22న రాత్రి 8 గంటలకు అశ్వవాహనం, త్రిశూలేశ్వర అలంకారం, 23వ తేదీ రాత్రి 8 గంటలకు శేషవాహనం, అర్ధనారీశ్వర అలంకారం, 24న రాత్రి 8 గంటలకు హంస వాహనం, చతుర్ముఖ బ్రహ్మ అలంకారంలో కనిపిస్తారు. 25వ తేదీ రాత్రి 7.30 గంటలకు బ్రాహ్మణ సంతర్పణ, పార్వతీ పరమేశ్వర అలంకారం, రాత్రి 12 గంటలకు కళ్యాణం, తెల్లవారు జామున 3 గంటలకు గజోత్సవం, 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి, నందిసేవ, ఉమామహేశ్వర అలంకారం, 27న గురువారం ఉదయం 11.30 గంటలకు రథోత్సవం, గౌరీ శంకర అలంకారం, 28న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, వసంతోత్సవం, సాయంత్రం 4 గంటలకు మోహిని అలంకారం, రాత్రి 8.30 గంటలకు దొంగలదోపు, రాత్రి 2.30 ధ్వజావరోహణ, మూగబలి, కంకణ విసర్జన ఉంటాయి. 1, 2, 3 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు ఏకాంతసేవ, పుష్పమండపం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

16 అడుగుల జనుమ చెట్టు !



16 అడుగుల మేర పెరిగిన జనుమ మొక్క

పొన్నలూరు: సాధారణంగా జనుమ మొక్క 6 అడుగుల లోపు ఉంటుంది. దీన్ని పొలంలో సాగు చేసి భూమి సత్తువ కోసం దున్నేస్తారు. కానీ ప్రకాశం జిల్లా పొన్నలూరు గ్రామంలో తాటియల్లమంద తన టీ కొట్టు దగ్గర పెంచిన జనుమ మొక్క ఓ చెట్టులా భారీగా పెరిగి అందరినీ ఆకట్టుకుంటోంది. సుమారుగా 16 అడుగుల మేర పెరిగి పూత పూసి ఉండటం విశేషం. దీన్ని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తూ ఆశ్చర్యపోతున్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



పొందుగుల వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. పెద్దారవీడు పంచాయతీ సిద్ధినాయునిపల్లి గ్రామంలో అక్రమ కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చిన పొందుగుల వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీదేవిలను ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార మదంతో టీడీపీ నాయకులు పెట్రేగిపోతున్నారని, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి తాత్కాలిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో కూటమి నాయకులకు ప్రజాక్షేత్రంలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కూటమి నాయకుల అండ చూసుకొని పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని, వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఎల్లప్పుడూ ఒకే ప్రభుత్వం అధికారంలో కొనసాగదని తెలుసుకోవాలని, తాము అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై రాజ్యాంగ పరంగా చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రజా సంక్షేమం కోసం పని చేయాలన్నారు. గ్రామంలో జరిగిన సీసీ రోడ్డు వివాదంలో సంఘటన స్థలంలో లేని వ్యక్తులపై అక్రమంగా టీడీపీ నాయకుల సిఫారసుతో కేవలం వైఎస్సార్ సీపీ చెందిన సానుభూతిపరులనే అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్‌పై వచ్చిన వారికి పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని చెప్పారు. అక్రమ కేసులకు భయపడొద్దని ధైర్యంగా ఉండాలన్నారు. కార్యకర్తల కోసం ఎంత వరకైనా వెళ్తామని వారికి అండగా ఉండి కాపాడుకుంటామని మనోధైర్యం నింపి భరోసా ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులతో పాటు నామ మాత్రంగా కార్యాలయంలో నోటీసు కాగితం ఇచ్చారే కానీ ఎంపీడీఓ జాన్‌సుందరం, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్యలు నేరుగా సమావేశానికి హాజరు కావాలని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని చెప్పారు. అనంతరం గ్రామంలోని రుద్రపాటి వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు వెన్నా శివకృష్ణారెడ్డి, సర్పంచులు అంగిరేకుల ఆదినారాయణయాదవ్, పొందుగుల వెంకటరెడ్డి, గుడ్డెపోగు రమేష్, పాలగిరి రామాంజనేయరెడ్డి, నాయకులు కాసు వెంకటరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, తోకల ఆవులయ్య, కోలగొట్ల వెంకటరెడ్డి, బత్తుల సాలయ్య, కోలగొట్ల రంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక



జిల్లా టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన బాల బాలికల జట్ల క్రీడాకారులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణలో ఆదివారం ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక నిర్వహించారు. బాలుర విభాగంలో ఆర్ కార్తికేయ, ఎం శివశంకర్, వీ వెంకటేశ్వర్లు రెడ్డి, డీ కౌశిక్‌బాబు, కే హర్షవర్ధన్, బాలికల విభాగంలో బీ జాస్మియా, పీ జాహ్నవి, ఎల్ నిఖిత, బీ పద్మ, బీ కృప ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన వారు ఈనెల 20, 27 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ కే శంకరరావు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టీ నారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణ ఇప్పటి వరకూ రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖలో సహాయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ డెప్యుటేషన్‌పై జిల్లాకు రానున్నారు.

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి



గాయపడిన యువకుడి సహాయం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పొదిలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అటుగా వెళ్తున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సాయమందించి మానవత్వం చాటుకున్నారు. పొదిలి మండలం కొండాయపాలెం గ్రామానికి చెందిన ఆచారి ఆదివారం పొదిలిలో సొంత పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా దొనకొండ అడ్డరోడ్డు సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆచారి కిందపడి స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కిందపడి ఉన్న యువకుడిని చూసి తన కారు ఆపి అతడిని లేపి సపర్యలు చేశారు. 108కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు.

19 నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

ఒంగోలు సిటీ: డ్రాయింగ్, టైలరింగ్ టెక్నికల్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఏ కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు రాంనగర్ మున్సిపల్ హైస్కూల్, ఏబీఎం జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలని కోరారు. హాల్ టిక్కెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్ఈ. ఏపీ. జీటీవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కొండయ్య మృతదేహం

పొదిలి రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీలోని గోగినేనివారిపాలెం సమీపంలో ఒంగోలు–కర్నూలు రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కనిగిరి ఇందిరాకాలనీకి చెందిన కొమ్మిరెడ్డి వెంకట కొండయ్య (55) కొంత కాలంగా పొదిలిలో నివాసముంటున్నాడు. ఉదయం పని నిమిత్తం పొదిలి నుంచి గోగినేనివారిపాలేనికి వెళ్లి రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ కింద పడి మహిళ దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

దొనకొండ: ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని తెల్లబాడు పంచాయతీ నల్లబోతులవారిపాలెం పొలాల్లో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఆళ్ల రమణమ్మ (45) కౌలుకు తీసుకున్న పొలంలో పండించిన పొగాకును ట్రాక్టర్‌లో లోడు చేసుకుని తెరిచిన ట్రాక్టర్ డోరుపై కూర్చుని వస్తుంది. ఈ క్రమంలో ట్రాక్టర్ అకస్మాత్తుగా గుంటలో పడటంతో డోరుపై కూర్చున్న రమణమ్మ కిందపడింది. ఆమె తలపై ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త కోటయ్య రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై టి.త్యాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రమణమ్మ కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మటన్ మార్కెట్



లైవ్ ఫిష్ వద్ద కొనుగోలుదారులు



అమ్మకాలు లేక వెలవెలబోతున్న చికెన్ స్టాల్స్



అక్కడ బేరాల్లేవ్.. ఇక్కడ గిరాకీ ఫుల్..

గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. నిన్న మొన్నటి వరకు చికెన్ కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.180కి తగ్గించినా కొనుగోళ్లు బాగా మందగించాయి. ఒంగోలులో చికెన్ దుకాణాలన్నీ కళ తప్పాయి. మరో పక్క మటన్, చేపలకు గిరాకీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మటన్ అమ్మకాలు సాగాయి. చేపల ధరలను మాత్రం బాగానే పెంచి విక్రయించారు. బర్డ్ ఫ్లూకు ముందు కిలో మోయ చేపలను రూ.200 నుంచి రూ.250లకు విక్రయించగా.. ఇప్పుడు రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయించారు. అవసరాన్ని ఆసరాగా చేసుకొని అన్నీ రకాల చేపలపై రూ.50 నుంచి రూ.100 అదనంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

–ఒంగోలు టౌన్



చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులతో సందడి

కూలిన బతుకులు

- ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి
- 10 మందికి పైగా గాయాలు
- మిర్చి కోతలకు వెళుతుండగా ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ముస్నీ మృతదేహం



సంఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

మార్కాపురం: కూలీల ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా.. పది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం మార్కాపురం మండలం నికరంపల్లి – కుంట మధ్య జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన సుమారు 25 మంది కూలీలు ఆదివారం ఉదయం మిర్చి కోతలను కోసేందుకు పెద్దారవీడు మండలం చట్లమిట్ల గ్రామానికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు కోతలు అయిపోగానే తిరిగి ఆటోలో బయలుదేరారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో నికరంపల్లి గ్రామం దాటగానే టైరుపేలి ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కొండారెడ్డికాలనీకి చెందిన షేక్ మున్నీ (36), అరబోలు లక్ష్మీదేవి(56)లకు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అరబోలు లక్ష్మీదేవి ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డ్రైవర్ సయ్యద్ మస్తాన్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న సుబ్బులు, నాసరయ్య, లక్ష్మి, మస్తానమ్మ, ఖైరూన్, శ్రీలక్ష్మి, రసూల్ బీ, కరీమున్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొండారెడ్డికాలనీ వాసులు పెద్దసంఖ్యలో జీజీహెచ్‌కు వెళ్లారు. కాలనీ వాసులు రావడంతో జీజీహెచ్‌లో రోదనలు మిన్నంటాయి. సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి జీజీహెచ్‌కు వెళ్లారు. కాగా గత నెలలో పోలీసులు, ఆర్టీసీ అధికారులు ప్రమాదాల నివారణ కోసం కూలీల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశారు. అయితే పలువురు కూలీలు మూడు రోజులపాటు వెళ్లి మళ్లీ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

మిన్నంటిన రోదనలు..

ప్రమాదంలో కొండారెడ్డికాలనీకి చెందిన షేక్ మున్నీ మృతి చెందారు. దీంతో భర్త షేర్‌వలితో పాటు ముగ్గురు పిల్లలు తల్లి మృతదేహాన్ని చూసి పెద్దపెట్టున రోదించారు. షేర్‌వలి మెయిన్‌బజారులో జ్యూస్‌బండి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా.. భార్య మున్నీ కూలీపనులకు వెళ్తూ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. ఈ సంఘటనలో ఆమె మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.



బోల్తాపడిన ఆటో

ఉత్సాహంగా ప్రకాశం బాలోత్సవం

- జిల్లా నలుమూలల నుంచి 5 వేల మంది విద్యార్థుల హాజరు
- ఆలోచనరేకెత్తించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కళా ప్రదర్శనలు



బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో ప్రకాశం బాలోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఆదివారం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 5 వేల మందికి విద్యార్థులు, చిన్నారులతో పాటుగా తల్లితండ్రులు తరలివచ్చారు. వేదికపై ప్రదర్శించిన ఎనిమిది లఘు నాటికలు ఆలోచన రేకెత్తించాయి. భావితరాలు మన మూలాలను మరిచిపోకుండా జానపద నృత్యాలు, కోలాటం ప్రదర్శించడం పట్ల అభినందనలు వెల్లువెత్తాయి. మట్టితో చేసిన బొమ్మలు చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీశాయి. చిత్రలేఖనం బాలల నైపుణ్యాన్ని చాటి చెప్పింది. వ్యాసరచన, వక్తృత్వం, పద్యం లాంటివి ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనకు అద్దం పట్టాయని అతిథులు పేర్కొన్నారు. 57 అంశాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్టేజీ భయాన్ని పోగట్టి ధైర్యంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా డ్రగ్స్, మద్యపానం, గంజాయిలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకోవడం చాలా అవసరమని, బాలోత్సవం ద్వారా విద్యార్థుల్లో హేతుబద్ధ ఆలోచనలకు పురుడు పోయడం అభినందనీయమని కొనియాడారు. బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షుడు డి. వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండవ మురళీ కృష్ణ, ఈదర హరిబాబు, కొమ్మోజు శ్రీనివాసరావు, బండారు లక్ష్మీ నారాయణ, కె. సుబ్రమణ్యం, టి. వరప్రసాద్, వై. శ్రీనివాసులు, అవినాష్, రమేష్ బాబు, ఏవీ పుల్లారావు, డాక్టర్ అనుశ్రీ, ఎస్ రవి. అబ్దుల్ హై, బాలకోటయ్య, సీహెచ్ వినోద్, చినసామి, చంద్రశేఖర్, కేఎఫ్ బాబు, దామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ సుబేదార్ మృతి



బాబురావు పార్థివదేహంపై జాతీయజెండాను కప్పుతున్న సైనిక అధికారులు



బాబురావు(ఫైల్)

బేస్తవారిపేట: అనారోగ్యంతో ఆర్మీ సుబేదార్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గొట్టమిండ్లకు చెందిన గొట్టం బాబురావు(46) అస్సాంలో 60 ఇంజినీరింగ్ రెజిమెంట్‌లో సుబేదార్‌గా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. మెడికల్ సెలవుపై పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత తీవ్రమైన జ్వరం, ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో ఒంగోలు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పూణె ఆర్మీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. శనివారం రాత్రికి బాబురావు పార్థివదేహాన్ని గొట్టమిండ్ల తీసుకొచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు..

బాబురావు పార్థివదేహానికి ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. అస్సాం 60 ఇంజినీరింగ్ రెజిమెంట్ సుబేదార్ గురుజిందర్‌సింగ్, ఒంగోలు ఎన్‌సీసీ యూనిట్ హవల్దార్ మెన్‌పాల్‌సింగ్, ఆఫీసర్ ఇగ్బాల్‌బాషా జాతీయ జెండాను బాబురావు పార్థివదేహంపై ఉంచి గౌరవ వందనం సమర్పించారు. కుటుంబసభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై లీగల్ సెల్ కీలక భూమిక పోషించాలి

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలపై జరుగుతున్న అక్రమ దాడులు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసుల విషయంలో లీగల్ సెల్ కీలక భూమిక పోషించాలని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలబడాలని కోరారు. రాబోయే రోజుల్లో లీగల్ సెల్ మరింత ప్రభావవంతంగా పనిచేసి, పార్టీ కార్యకర్తలకు న్యాయసహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, జిల్లా స్థాయి న్యాయవాదులు, నియోజకవర్గానికి చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

వీఆర్వో ఆచూకీ కోసం సాగర్ కాలువలో గాలింపు



సాగర్ కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

త్రిపురాంతకం: మండలంలోని మిట్టపాలెం వీఆర్ఓ పాలుట్ల నాగరాజు ఆచూకీ కోసం స్థానిక సాగర్ కాలువద వద్ద ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..వీఆర్వో పాలుట్ల నాగరాజు కనిపించకుండా పోయాడని ఆయన భార్య శైలజ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఆయన శుక్రవారం ఉదయం ఇంట్లో సెల్ పెట్టి మోటారు బైక్‌పై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన బైక్ యర్రగొండపాలెం రోడ్డులో ఉన్న సాగర్ కాలువ వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఎస్సై శివబసవరాజు కాలువలో తీవ్రంగా గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నతాధికారుల అనుమతితో కాలువలో విస్తృతంగా గాలించేందుకు విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించారు. వారు సాగర్ కాలువ వంతెన నుంచి కురిచేడు వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. వీఆర్వో అదృశ్యమై మూడు రోజులైనా జాడ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు, రెవెన్యూ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు.

వాలీబాల్ విజేత ప్రకాశం

- పురుషుల, మహిళల విభాగాల్లో ప్రథమస్థానం
- ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి, విజయవాడ



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం పురుషుల జట్టు



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం మహిళల జట్టు

ఒంగోలు: మూడురోజుల పాటు ఉత్కంఠగా సాగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ కరవదిలో ఆదివారం ముగిసింది. పోటీల్లో ప్రకాశం జిల్లా క్రీడాకారులు పురుషుల విభాగం, మహిళల విభాగంలో రాణించి ప్రథమస్థానంలో నిలిచి ప్రకాశం క్రీడా పతాకాన్ని రెపరెపలాడించారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న పోటీలు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సాహభరితంగా, ఉత్కంఠగా సాగిన పోటీల్లో ప్రకాశం జట్టు పురుషుల విభాగంలోను, మహిళల విభాగంలోను పైచేయి కనబరిచి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో తూర్పుగోదావరి జట్టు ద్వితీయ స్థానంతో నిలిచింది. మహిళల విభాగంలో ఎంవీపీ ట్రస్టు విజయవాడ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో కృష్ణా, వైఎస్సార్ కడప జట్టు 3,4 స్థానాలలో నిలవగా, మహిళల విభాగంలో వైఎస్సార్ కడప జట్టు తృతీయస్థానంలో నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రముఖులు డాక్టర్ శంకరరావు, డాక్టర్ మల్లికార్జునరావు, పారిశ్రామిక వేత్త సుబ్బారెడ్డి, అడ్వకేట్ శిరిగిరి రంగారావు, బైబిల్ మిషన్ గుంటూరు గవర్నింగ్ బాడీ సభ్యులు ఆర్ఎంపీ కుమార్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు ప్రదానం చేశారు.